క్లుప్తంగా

ఆర్టీసీ బస్టాండ్‌ల్లోని స్టాల్స్‌కు టెండర్ల ఆహ్వానం

గన్నవరం: గన్నవరం ఆర్టీసీ డిపో పరిధిలోని గన్నవరం, హనుమాన్‌జంక్షన్ బస్టాండ్‌ల్లో ఖాళీగా ఉన్న స్టాల్స్‌ను భర్తీ చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు డీఎం పి.శివాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ పత్రాలు ఈ నెల 27వ తేది వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీఎం కార్యాలయంలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తిచేసిన టెండర్ పత్రాలను మచిలీపట్నంలోని డీపీటీఓ కార్యాలయంలో ఈ నెల 28వ తేది ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు టెండర్ బాక్స్‌లో వేయాలని సూచించారు. అదే రోజు సాయంత్రం 3 గంటల తర్వాత టెండర్లను తెరచి అర్హత సాధించిన వారికి స్టాల్స్ కేటాయించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

పెనమలూరు మాజీ ఉసర్పంచి మృతి



పెనమలూరు: పెనమలూరు మాజీ ఉపసర్పంచి సోమవారం మృతి చెందారు. గ్రామానికి చెందిన ఆర్వపల్లి శ్రీకృష్ణారావు(చంటి) తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లో మూడు రోజుల క్రితం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన 2013–2018 మధ్య గ్రామ ఉపసర్పంచిగా పని చేశారు. చంటికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.

కమ్మ హాస్టల్‌కు విరాళం



పెనమలూరు: పెనమలూరులోని కమ్మ హాస్టల్‌కు సోమవారం దాత రూ. 2 లక్షల విరాళం అందజేశారు. గ్రామంలో బాలికల కమ్మ హాస్టల్ గత కొద్ది సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. దాత పుట్టగుంట సరస్వతీదేవి తన భర్త వీరభద్రరావు జ్ఞాపకార్థం విరాళం అందజేశారు. కార్యక్రమంలో సరస్వతీదేవి కుటుంబ సభ్యులు పి.రమేష్, సురేష్, లక్ష్మి, కమ్మ హాస్టల్ ప్రతినిధులు బొర్రా గాంధీ, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రస్థాన సాధన శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ప్రస్థాన సాధన శిక్షణ ముగిసింది. సోమవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఠాగూర్ గ్రంథాలయంలో 9 వారాల పాటు విద్యార్థులకు ప్రస్థాన సాధన శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అమరావతి బోట్ క్లబ్ ప్రతినిధి కాకాని తరుణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేయాలన్నారు. అది కూడా గురువు సమక్షంలోనే చేయాలని సూచించారు. ఠాగూర్ లైబ్రేరియన్ రమాదేవి మాట్లాడుతూ గ్రంథాలయంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతున్నప్పటికీ స్ఫూర్తి కుటుంబం నిర్వహించిన ఆసన, ప్రాణాయామ-ధ్యానం కార్యక్రమాలు మంచి ప్రభావాన్ని చూపాయన్నారు. గురువు ప్రభాకర్ మాట్లాడుతూ సాధన ద్వారా మానసిక ఒత్తిడులు తగ్గిపోతాయన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారన్నారు. స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ప్రతినిధులు కాకాని తరుణ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబ సభ్యులు మాధవి, కాదంబరి, జ్యోతి, గిరిజ, స్ఫూర్తి కుటుంబం ట్రస్టీస్ చొప్పరపు నారాయణరావు, పసుపులేటి నారాయణరావు, షణ్ముఖరావు వలంటీర్లు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): సహకార స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందిస్తూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మొండి బకాయిల వసూలుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సోమవారం విజయవాడ, హైదరాబాద్, తిరుపతి జోన్ల పరిధిలోని శాఖల సిబ్బందికి సహకార వ్యవస్థ ప్రాధాన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాఘవేంద్రరావు మాట్లాడుతూ సహకార జీవనం లేకుండా మానవ మనుగడ లేదని నమ్ముతున్న పాలకవర్గం నిర్ణయాలను సిబ్బంది శ్రద్ధతో అమలు చేయాలన్నారు. బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా పాలకవర్గం తీసుకున్న నిర్ణయాలను సమర్థంగా అమలు చేయడంతో పాటు అత్యధిక నిధుల సాధనకు, నిరర్థక ఆస్తుల తగ్గింపునకు కృషి చేసిన సిబ్బందిని రాఘవేంద్రరావు అభినందించారు. ఈ సందర్భంగా మొండి బకాయిల వసూలు చేపట్టిన సిబ్బందికి రూ. కోటి అవార్డు ప్రకటించారు. ఈ సదస్సులో బ్యాంకు మార్గదర్శకుడు మానం ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.రామకృష్ణారావు, డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, జనార్దన్, చిన్నం కోటేశ్వరరావు, పి.రమణరావు, పి.నారాయణ స్వామి, సీఈఓ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు



కానూరులో బక్రీద్ సందర్భంగా నమాజ్ చేస్తున్న ముస్లింలు

గన్నవరం రూరల్: త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ముస్తాబాద జామియా మసీద్ ఇమాం ఇక్బాల్ భక్తులకు సందేశమిచ్చారు. సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా స్థానిక మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇమాం ఇక్బాల్ సందేశమిస్తూ అల్లా ఆదేశాను సారం ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడు ఇస్మాయేల్‌ను త్యాగం చేయడానికి సిద్ధపడిన పవిత్ర దినం బక్రీద్ అని చెప్పారు. దానికి మెచ్చిన ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని ప్రశంసించాడని పేర్కొన్నారు. బక్రీద్ నెలలోనే హజ్ యాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ ముస్లిం తన జీవితకాలంలో హజ్ యాత్ర చేయాలని సూచించారు. మసీదు కమిటీ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదిన వేడుకలు

గన్నవరం: బక్రీద్ పర్వదిన వేడుకలను సోమవారం గన్నవరం ప్రాంతంలోని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో ఉదయం గన్నవరం జామా మసీదు ఆధ్వర్యంలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతిని వివరిస్తూ ముస్లిం మత గురువు బక్రీద్ పండుగ సందేశం ఇచ్చారు. అంజుమాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. దావాజీగూడెంలోని పామర్తినగర్‌లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ఈద్ నమాజును ముస్లింలు ఆచరించారు. పరిసర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

పెనమలూరులో ఘనంగా బక్రీద్

పెనమలూరు: పెనమలూరు మండల పరిధిలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా చేశారు. కానూరు, యనమలకుదురు, గంగూరు, పెనమలూరు తదితర గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి, సత్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యతకు, సోదర భావాన్ని అందరు అనుసరించాలని మత బోధకులు తెలిపారు. ముస్లిం సోదరులు బక్రీద్ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బక్రీద్ పండుగతో మసీదులు, దర్గాలు భక్తులతో కిటకిటలాడాయి.

కంకిపాడు: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సోమవారం బక్రీద్ పర్వదినం కావడంతో కంకిపాడు, గోసాల సెంటర్లలోని మసీదు, కల్యాణ మండపాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. త్యాగాల ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకొంటారని మత బోధకులు ప్రసంగించారు. తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, నాగవరప్పాడు, మానికొండ, పొట్టిపాడు తదితర గ్రామాల్లో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: బక్రీద్ పర్వదినాన్ని ఉయ్యూరులో భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉయ్యూరు పట్టణంతోపాటు మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో మసీదుల్లో సోమవారం అల్లాను ప్రార్థిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. వైఎస్సార్ సీపీ ఉయ్యూరు పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్షతున్నీసా బేగం, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, కౌన్సిలర్ బేగ్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సద్దాం పలువురు మైనార్టీ నేతలు ప్రార్థనల్లో పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పేదలపై కరుణ చూపడమే బక్రీద్

పి.నైనవరం(విజయవాడరూరల్): పేదలపై కరుణ చూపడమే బక్రీద్ పండుగ విశేషమని పి.నైనవరం మసీదు ఇమామ్ ఎండీ జాహీద్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం పి.నైనవరం గ్రామంలోని మసీదులో నమాజ్ కార్యక్రమం జరిగింది. ముస్లిం సోదరులను ఉద్దేశించి ఇమామ్ ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ పేదల పట్ల అభిమానంతో వారికి ఖుర్బానీ ఇవ్వడం చేయాలన్నారు. ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ కరుణ, త్యాగం భక్తి విశ్వాసంతో మెలగాలన్నారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నున్న గ్రామంలోని పెద్ద మసీదులో మహిళలకు షఫీవుల్లా ఖుర్దా చదివి వినిపించారు. కబరస్తాన్ ఈద్గాలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద షేక్ ఖాదర్‌వలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రార్థనలో ఇమామ్ షాదీద్, అత్కురు రెహ్మాన్ నమాజ్ చదివి వినిపించారు. అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



ముస్తాబాద మసీదులో సందేశమిస్తున్న ఇమాం ఇక్బాల్

శ్రీవెంకటేశ్వరస్వామికి 108 కలశాలతో అభిషేకం



భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న రామానుజ జీయర్‌స్వామి

పెనమలూరు: పోరంకి లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంలో 108 కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సోమవారం శ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో పంచామృత స్నపన, 108 కలశాలతో అష్టోత్తర శత కలశ స్నపన పూజలు చేశారు. భక్తులను ఉద్దేశించి శ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి ప్రసంగించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. శ్రీవారికి రాయభార ఉత్సవం చేశారు. కాగా మంగళవారం స్వామివారికి శ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో తిరుక్కల్యాణ మహోత్సవం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు. ఉదయం సువర్ణ పుష్పార్చన చేస్తారు. భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ అభివృద్ధి కమిటీ కోరింది.

ఘనంగా సువర్చలాంజనేయస్వామి కల్యాణం



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీభక్తిప్రపర్త ఆంజనేయస్వామి, సువర్చలాదేవి వార్ల కల్యాణోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వేద మంత్రాల నడుమ సువర్చలాంజనేయ స్వామివార్ల కల్యాణాన్ని భక్తితో జరిపించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. 2 వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. తొలుత ఆలయంలో ఆంజనేయ స్వామి, సువర్చలాదేవికి ఆయన ప్రత్యేక పూజలు జరిపించారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధి కొప్పరాజు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు తుమ్మలపల్లి హరికృష్ణ, అనుమోలు ప్రభాకర్‌రావు, స్థానిక ప్రతినిధులు పండలనేని ఫణీంద్ర, కొప్పరాజు ఆంజనేయులు, అన్నపనేని ప్రవీణ్, ముప్పా ప్రసాద్ పాల్గొన్నారు.

కొండేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



కొండేశ్వరస్వామికి కుంకుమ, చందన అభిషేకం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రసిద్ధ గంగా పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవస్థానంలో నిర్జల ఏకాదశి పర్వదినాన్ని సోమవారం విశేష పూజలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు కుందుర్తి మురళీ నేతృత్వంలో కొండేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, కుంకుమ, చందనాభిషేకాలు వైభవంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. నిర్జల ఏకాదశి రోజున విష్ణుమూర్తిని దర్శించుకోవడం, భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం వల్ల మనోవాంఛ నెరవేరుతుందని ఆలయ అర్చకులు మురళీ వివరించారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



కార్మికులకు సరుకులు అందజేస్తున్న సిరిలాస్య, సీతారామారావు, జాస్తి

కేసరపల్లి(గన్నవరం): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 44 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యాన యుఎస్ఏకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని రావిపాటి సిరిలాస్య రూ. 50 వేలు ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ... చిన్నారి సిరిలాస్య తను దాచుకున్న డబ్బులను సమాజ సేవకు వినియోగించడం అభినందనీయమన్నారు. పేద వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా రోటరీక్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గన్నవరం, కేసరపల్లి గ్రామపంచాయతీ కార్మికులకు గతంలో యూనిఫాం అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా పంచాయతీ కార్మికులకు రోటరీక్లబ్ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. రోటరీ క్లబ్ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటరీయన్లు గన్నె వెంకట్రావు, టీఎస్ఆర్‌కె.ప్రసాద్, రవిబాబు, గ్రామ ప్రముఖులు చేబ్రోలు జస్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

మానవత స్వచ్ఛంధ సంస్థకు నూతన శాంతిరథం



మానవత సభ్యులకు రూ. లక్ష విరాళాన్ని అందిస్తున్న డాక్టర్ దుట్టా



దాత తోట వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద, ధనిక భేదం లేకుండా ప్రతి మానవుడి అంతిమ యాత్ర గౌరవప్రదంగా నిర్వహించాలనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ 'శాంతి రథం' పేరిట ఉచిత వాహనాన్ని రూ. 5.50 లక్షలతో ఏర్పాటు చేసింది. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయం వద్ద శాంతిరథం నూతన వాహనాన్ని దాత తోట వెంకటేశ్వరరావు చేతుల మీదగా సోమవారం ప్రారంభించారు. ఆ సందర్భంగా శాంతిరథం కొనుగోలుకు రూ. 2.50 లక్షల విరాళాన్ని అందించిన దాత తోట వెంకటేశ్వరరావును మానవత సభ్యులు సత్కరించారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, క్లోపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు, పాబోలు గణేష్, వేగిరెడ్డి సూర్యనారాయణ, గొళ్ల మల్లికార్జునరావు, దయాల ప్రభాకరరావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ, బెజవాడ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మానవతకు రూ. లక్ష విరాళం

నేటి స్వార్థపూరిత సమాజంలో నానాటికీ కనుమరుగవుతున్న మానవత్వం, సేవా తత్పరతలను పెంపొందించేందుకు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ నిస్వార్థంగా చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని ప్రముఖ వైద్యులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖకు రూ. లక్ష విరాళాన్ని ఆయన అందించారు. స్థానిక విజయవాడరోడ్డులోని సీతామహాలక్ష్మీ నర్సింగ్ హోంలో ఈ మొత్తాన్ని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు సోమవారం అందజేశారు. నిరంతరంగా మానవత సభ్యులు చేస్తున్న నిస్వార్థ సేవలను కొనియాడారు. తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ మానవత సంస్థకు ఉంటాయని చెప్పారు. మానవత లాంటి స్వచ్ఛంధ సేవా సంస్థలు మరిన్ని ముందుకు వచ్చి ఆపన్నులకు అండగా నిలబడాలని కోరారు.

దుట్టా తనయుడు రవిశంకర్, మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు గూడపాటి జయరామచంద్రరావు, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, క్లోపల్లి నారాయణరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, గొళ్ల మల్లికార్జునరావు, దయాల ప్రభాకరరావు, రేవిణిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేత్రాల విషయంలో నిర్లక్ష్యం తగదు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాల విషయంలో నిర్లక్ష్యం తగదని అమరావతి ఐ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ అన్నారు. అమరావతి ఐ ఫౌండేషన్ దేవదాయ, ధర్మదాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పాత బస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ప్రాంగణంలో సోమవారం మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంతశర్మ మాట్లాడుతూ అమరావతి ఐ ఫౌండేషన్ పక్షాన సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రధాన వైద్యులు డాక్టర్ కేతినేని శైలజ, నాదెండ్ల వేణు మాట్లాడుతూ నేత్రాల విషయంలో కనీస జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం శివాలయం ప్రాంగణంలో సుమారు 265 మందికి ఉచితంగా వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

• తటాకంలా మారిన రహదారి

విజయవాడ నిర్మల కాన్వెంట్ రోడ్డు వర్షం వస్తే తటాకంలా మారిపోతోంది. వర్షం వచ్చి వెలసి రెండు, మూడు రోజుల వరకు కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఆదివారం రాత్రి వచ్చిన వర్షానికి ఆ రహదారి అంతా చెరువులా దర్శనమిస్తోంది. సోమవారం కూడా నీటి ఉధృతి అలాగే ఉంది. ఈ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన కరెంట్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ ఉన్నాయి. రోడ్డుపై నిలిచిన నీటి ఉధృతి పెరిగి ఫుట్‌పాత్ మీదుకు వస్తే కరెంట్ వైర్లు నీటిలో మునుగుతాయి. ఇలా అయితే పెను ఉత్పాతం జరిగే ప్రమాదం ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



నిర్మల కాన్వెంట్ రోడ్డులో రెండో రోజు కూడా రోడ్డుపై తగ్గని నీరు



చెరువును తలపిస్తున్న పటమట చర్చి ప్రాంగణం



నిర్మల కాన్వెంట్ రోడ్డులో వర్షపు నీటి పక్కనే ఫుట్ పాత్ సమీపంలో ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

బాబా మందిరంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం బక్రీద్ పురస్కరించుకుని అన్నదానం జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.